# రైతాంగ సమస్యల పరిష్కారానికై ఆందోళన

**దేవరకొండ, 11-1-16 :**

నల్గొండజిల్లా దేవరకొండ డివిజన్‌లో పత్తిచేలు ఎండిపోయి కరువు తీవ్రంగా వున్నది. చెరువులు, కుంటలు నిండలేదు. 8 మండలాలో దేవరకొండ, చంధంపేట, డిండి, పి.ఎ.పల్లి, చింతపల్లి, మర్రిగూడ, తదితర గ్రామాలకు ఎస్.ఎల్.బి.సి. (ఎ.ఎం.ఆర్.సి.) కాలువకింద ఆరుతడి పంటలకు నీరు వదలలేదు. గత సంవత్సరం కరువు ఉన్నా, కేసీఆర్ ప్రభుత్వం కరువు ప్రాంతంగా ప్రకటించలేదు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల వలన రైతు కూలీలు నష్టపోతున్నారు. పంటలు ఎండిపోయి, తెచ్చిన అప్పులు తీరక బ్రతుకుదెరువు కొరకు పట్టణాలకు వలసపోతున్నారు. గుర్రంపోడ్, పి.ఎ.పల్లి., మండలాలను కరువు ప్రాంతంగా ప్రకటించి ఎకరాకు 10 వేల రూ॥లు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్‌చేస్తూ తెలంగాణా రైతుకూలీసంఘం ఆందోళనకు పిలుపు నిచ్చింది.

భూమిలేని ఎస్‌సి., ఎస్.టి. పేదలకు 3 ఎకరాల భూమి కొనుగోలుచేసి ఒక్క సంవత్సరం పెట్టుబడి పెడతానని నమ్మబలికిన కేసీఆర్, గత 19 నెలల కాలంలో జిల్లా మొత్తంమీద ఎస్.సి. పేదలకు 124 మందికి 354 ఎకరాలు పంచినట్లు అధికారులు చెపుతున్నారు. జిల్లాలో భూమిలేని వేలాది కుటుంబాలు 3 ఎకరాల భూమి కొరకు ఎదురుచూస్తున్నారు. 1973 భూసంస్కరణల చట్టాన్ని సవరించి అన్ని కులాలలోని పేదలకు భూస్వాముల భూములను, దేవాదాయ భూములను పంచాలి. గ్రామాల్లో రాజకీయ కారణాల వలన అధికారులు వృద్ధాప్య పింఛన్లు, రేషన్ కార్డులు ఇవ్వకపోవటంవలన వృద్ధులు, అర్హులైన వారు ఆఫీసుల చుట్టూ 14 నెలల నుండి తిరుగుతున్నప్పటికీ అధికారులు కనికరం చూపటంలేదు. రేకులు, గుడిసెలు, పెంకుటిండ్లలో వున్న అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు కట్టిస్తానని చెప్పిన కెసిఆర్ ఇప్పుడు లాటరీ పద్ధతిలో ఇస్తామంటున్నారు. లాటరి పద్ధతి కాకుండా అర్హులైన పేదలందరికీ ఇండ్లు మంజూరు చేయాలి. నక్కలగండి, డిండి ఎత్తిపోతల కింద సింగరాశిపల్లి, గొట్టిముక్కల, కిష్టరాంపల్లి, చెర్లగూడెం రిజర్వాయర్ల క్రింద భూములు కోల్పోతున్న రైతాంగానికి పునరావాసం, జీవనోపాధి, వారి వ్యవసాయ భూములకు ఎకరానికి 10 లక్షలు చెల్లించాలని రైతుకూలీసంఘం డిమాండ్ చేస్తూ, పై సమస్యల పరిష్కారానికి 11-1-2016న దేవరకొండ ఆర్.డి.ఒ. కార్యాలయం ముందు ధర్నాకు తెలంగాణా రైతుకూలీసంఘం పిలుపునిచ్చింది. దీనిలో వివిధ గ్రామాల రైతు, కూలీలు పాల్గొన్నారు. ఈ క్రింది డిమాండ్స్‌తో కూడిన మెమోరాండంను ఆర్‌డిఓకు అందజేశారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతుకూలీసంఘం నల్గొండజిల్లా అధ్యక్షులు జక్కుల నర్సింహ, దేవరకొండ డివిజన్ కన్వీనర్ మునుగోటి అంజయ్య తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు.

**డిమాండ్స్ :**

1) తెలంగాణ రాష్ట్రవ్యవసాయ శాఖ రైతులు పండించిన పంటలకు ధరలు నిర్ణయించిన నివేదికను కేంద్రప్రభుత్వానికి పంపినందున వ్యవసాయ శాస్త్రవేత్త డా॥స్వామినాధన్ కమీషన్ సిఫారసుల మేరకు రైతులకు లాభదాయక గిట్టుబాటుధర కల్పించాలి. పెంచిన ఎరువుల, విత్తనాల పురుగుమందుల ధరలు తగ్గించాలి. నకిలీ ఎరువులు, విత్తనాలు, పురుగుమందులను నిషేధించాలి. 2) 2012 సం॥లో గుర్రంపోడు మండలంలో బత్తాయి చెట్లు ఎండిపోయినప్పుడు రైతులకు మంజూరైన నష్టపరిహారం ఇవ్వాలి. 3) గుర్రంపోడు, పి.ఎ.పల్లి మండలాలను కరువుప్రాంతంగా ప్రకటించాలి. ఎకరానికి పంటనష్టం 10 వేల రూపాయలు ఇవ్వాలి. 4) ఇండ్లులేని పేదలందరికి ఇండ్లకు అర్హులైన పేదలకు, వృద్ధాప్య, ఒంటరి ఫించన్లు, రేషన్‌కార్డులు మంజూరుచేయాలి. 5) 1973 భూసంస్కరణల చట్టాన్ని సవరించి, భూస్వాముల భూములను భూమిలేని పేదలకు 3 ఎకరాల చొప్పున పంచాలి. 6) భూసేకరణ చట్టం, తెలంగాణ ప్రభుత్వం తెచ్చిన జీ.ఓ. నెం.103, 214 లను ఉపసంహరించి తక్షణమే రైతులకు పునరావాసం జీవనోపాధి, ఇండ్లకు వ్యవసాయ భూములకు న్యాయమైనధర ఎకరానికి 10 లక్షలు ఇవ్వాలి. 7) గుర్రంపోడు మండల కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ ఏర్పాటు చేయాలి. 8) ఎస్.ఎల్.బి.సి. ప్రాజెక్టు క్రింద కాలువల పూడికతీయాలి. మైనర్‌కాలువల నుండి పంటకాలువలు తీయాలి. చెరువులకు ప్రత్యేకంగా కాలువలు తీయాలి. 9) పెండింగులో వున్న ఇండ్ల భూములు వెంటనే మంజూరు చేయాలి.

ooooo